నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి జైలుశిక్ష

గౌలిపురా : నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి దాటినా అనంతరం పాన్ షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తికి నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ సత్యనారాయణ రెండ్రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్సై లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన మహ్మద్ అమేర్ (35) పాన్‌షాపును నిర్వహిస్తున్నాడు. మహ్మద్‌అమేర్ తన పాన్‌షాపును పోలీసుల నిబంధనలను ఉల్లంఘిస్తూ.. అర్ధరాత్రి దాటిన అనంతరం కూడా నిర్వహిస్తుండటంతో భవానీనగర్ పోలీసులు అతడిపై ఈ–పెట్టీ కేసు నమోదు చేసి బుధవారం నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరిచారు. దీంతో మెజిస్ట్రేట్ సత్యనారాయణ తీర్పునిచ్చారు.

షేక్‌పేట కార్పొరేటర్‌కు బెదిరింపు కాల్

కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి, షేక్‌పేట కార్పొరేటర్ ఫరాజుద్దీన్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఇంటర్నెట్ కాల్ ద్వారా ఫోన్‌చేసి బెదిరింపులకు పాల్పడిన ఘటనలో నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 507 కింద ఫిల్మ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. షేక్‌పేట కార్పొరేటర్ ఫరాజుద్దీన్ ఇటీవల ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఎంఐఎం పార్టీ తరుపున పోటీ చేశారు. ఎన్నికల తర్వాత ఓ వ్యక్తి ఫోన్ చేసి 'ఎన్నికల్లో ఒవరాక్షన్ చేస్తున్నావ్.. తగ్గించుకుంటే మంచిది.. నేను బీఆర్‌ఎస్ కార్యకర్తను..నీ అంతుచూస్తాను అంటూ' బెదిరించాడు. దీంతో ఫరాజుద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయస్థానం అనుమతి తీసుకున్న ఫిల్మ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

డీసీఎంను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

సంతోష్‌నగర్: డీసీఎం వాహనాన్ని ఢీకొట్టిన ఓ ద్విచక్ర వాహనదారుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. మృతిచెందిన ఘటన కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట్ మల్లికార్జున్‌నగర్ ప్రాంతానికి చెందిన సరిత, కొమరయ్య (45)లు దంపతులు. కొమరయ్య రామాంతపూర్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా కొమరయ్య ఈనెల 2న మధ్యాహ్నం 12.45 గంటలకు తన ద్విచక్ర వాహనం (ఏపీ11ఏటీ1190)పై డీఎంఆర్‌ఎల్ ఎక్స్ రోడ్డు నుంచి చాంద్రాయణగుట్ట వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో రోడ్డుపై ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలకు గురైన కొమరయ్యను స్థానికులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ.. బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన



పీపీటీ ద్వారా అవగాహన కల్పిస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల పెరుగుతున్న నేపథ్యంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పెద్ద ఎత్తున సైబర్ నేరాల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా మొదటి బుధవారం 'సైబర్ జాగురుక్తా దివస్'లో భాగంగా బుధవారం సైఫాబాద్‌లోని పీజీ కాలేజీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ టీ. వినయ్‌కుమార్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం సోషల్ నెట్‌వర్క్ వినియోగం, ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం, భద్రత, సామాజిక మాధ్యమాల సమస్యలు, డిజిటల్ చెల్లింపు పద్ధతులు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర అంశాలపై విస్తృత స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మజ్లిస్ నాయకుడికి నివాళి



మహ్మద్ బదరుద్దీన్

గోల్కొండ: మహ్మద్ బదరుద్దీన్ మృతి మజ్లిస్‌కు తీరని లోటని ఆ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. బుధవారం ఆయన గోల్కొండ జమాలికుంట ముస్లిం శ్మశానవాటికలో జరిగిన మహ్మద్ బదరుద్దీన్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చురుకైన నాయకుడిగా పేరుపొందిన ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గోల్కొండ: గోల్కొండ డివిజన్ కార్పొరేటర్ సమీనాయాస్మిన్ భర్త మహ్మద్ బదరుద్దీన్ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. రాత్రి 12 గంటల సమయంలో గోల్కొండలోని ఆయన స్వగృహంలో ఉండగా గుండెపోటు వచ్చి కుప్పకూలిపోయారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం కాగా.. ఆయన మృతి పట్ల కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్, చార్మినార్ ఎమ్మెల్యే మిర్‌జుల్ఫికార్ అలీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. కళా మసీదులో చివరి ప్రార్థనలు నిర్వహించి మధ్యాహ్నం గోల్కొండ నయాఖిలాలోని జమాలికుంట ముస్లిం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

డీసీపీ శరత్‌చంద్ర పవార్‌కు శుభాకాంక్షలు



నాంపల్లి : మధ్య మండలం డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన శరత్‌చంద్ర పవార్‌ను పీస్ కమిటీ నాయకులు మహ్మద్ ఇస్మాయిల్ అన్సారీ అలియాస్ ఉర్దూ అన్సారీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం డీసీపీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మధ్య మండలంలోని పలు సమస్యలను డీసీపీ దృష్టికి ఆయన తీసుకెళ్లారు. మహ్మద్ బషీర్ అలీ, ఠాకూర్ హృదయనాథ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నాలా పనులను పూర్తిచేయాలి



చార్మినార్: యాకుత్‌పురా నియోజకవర్గంలోని మౌలాకా చిల్లాలో గత 8 నెలలుగా నిలిచిపోయిన ఓపెన్ నాలా పనులను తిరిగి ప్రారంభించి స్థానిక సమస్యను పరిష్కరించాలని ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్, జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నను కోరారు. బుధవారం ఉదయం ఆయన మౌలాకా చిల్లాలో పర్యటించారు. ఓపెన్ నాలా పనులు నిలిచిపోవడంతో మురుగు సమస్యతో పాటు భరించలేని దుర్వాసన వెలువడుతోందన్నారు. తద్వారా దోమలు వ్యాపిస్తున్నాయనే విషయాన్ని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకుని వెంటనే పనులను ప్రారంభించాలన్నారు.

ఆకట్టుకుంటున్న ఆభరణాలు

- పాతబస్తీలో రోల్డ్ గోల్డ్ నగలకు పెరిగిన గిరాకీ
- దొంగల టెన్షన్ లేకపోవడంతో అధిక ప్రాధాన్యం
- మహిళలను ఆకట్టుకుంటున్న నగలు

బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బంగారు ఆభరణాలు ధరించాలనే మోజు ఉన్నప్పటికీ.. పేద ప్రజలతో పాటు సాధారణ మధ్యతరగతి ప్రజలు వాటిని ఖరీదు చేయడానికి స్తోమత సరిపోవడం లేదు. దీంతో రోల్డ్‌గోల్డ్ నగల వైపు ఆకర్షితులవుతున్నారు.



చార్మినార్ వద్ద టేలా బండిపై విక్రయిస్తున్న నగలు



లాడ్‌బజార్‌లోని ఓ దుకాణంలో ఆకట్టుకుంటున్న ఆభరణాలు

చార్మినార్: పాతబస్తీ చార్మినార్–లాడ్‌బజార్‌లో రోల్డ్ గోల్డ్ నగలు మహిళలను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. తక్కువ ఖరీదు..అందానికి అందం. పూర్తిగా బంగారాన్ని పోలీన రోల్డ్ గోల్డ్ నగలకు మహిళల్లో ఆదరణ పెరిగింది. ప్రస్తుతం తులం బంగారం ధర రూ. 50వేలకు పైగా పలుకుతోంది. దీంతో దిగువ మధ్యతరగతితో పాటు దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న ప్రజలకు ఈ నగలు ఎంతో మేలు చేస్తున్నాయి.

- పెళ్లిళ్లు పేరంటాళ్లకు వెళ్లడానికి మహిళలకు బంగారు నగలు లేవనే బాధ లేకుండా ఈ రోల్డ్ గోల్డ్ నగలు పనికొస్తున్నాయి. గిల్టీ నగలు (రోల్డ్ గోల్డ్).. దగ దగ మెరుస్తూ... మనస్సును ఇట్టే ఆకట్టుకుంటున్నాయి.
- పేద, గొప్ప అనే తేడాలు లేకుండా ప్రతి ఒక్కరూ ప్రస్తుతం వీటినే ధరిస్తున్నారు. అక్కడక్కడ చైన్‌స్నాచింగ్‌లు జరుగుతుండటంతో రోజువారీగా మహిళలు వీటినే విరివిరిగా వినియోగిస్తున్నారు. కేవలం వివాహాది శుభకార్యాల్లో మాత్రమే బంగారు నగలను వాడుతున్నారు.
- గిల్టీ నగలతో దొంగల భయం లేకపోవడంతో వీటికి రాను రాను మహిళల్లో ఆదరణ పెరుగుతోంది. మార్కెట్‌లో గిరాకీ కూడా పెరుగుతుంది.

ఆకర్షణీయమైన డిజైన్‌లలో..

రంగురంగుల మెరుపు రాళ్ల (స్టోన్స్)తో తయారైన ఈ నగలు మగువల మనస్సు దోచడమే కాకుండా చూపరుల దృష్టిని అమాంతం ఆకర్షిస్తున్నాయి. వీటికి బంగారు నగల కన్నా ఎక్కువ గిరాకీ ఉంది. తక్కువ ఖరీదుతో బంగారు నగల్లా కనిపించే వీటికి రోజురోజుకు ఆదరణ క్రమంగా పెరుగుతోంది.

- మహిళల ఆదరణ చూసిన మార్కెట్ వర్గాలు రకరకాల గిల్టీ నగలను మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారు.
- ఉంగరాలు, చెవిపోగులు, కమ్మలు, దిద్దులు, నల్లపూసల తాడు, పుస్తెల తాడు, నెక్లెస్, ఒంకు, వడ్డానం, పచ్చలు, కెంపుల హారాలు.. ఇలా ఒకటేమిటి రూ. 10 నుంచి రూ. 15 వేల వరకు ఈ నగలు అందుబాటులో ఉన్నాయి.

బంగారానికి తీసిపోని విధంగా...

- బంగారు నగలకు ఏమాత్రం తీసిపోని విధంగా అసలుకు ధీటుగా మార్కెట్‌లో ఈ నగలు సందడి చేస్తున్నాయి. సామాన్యులు 2 తులాల నెక్లెస్ చేయించుకోవాలంటే ఇప్పుడున్న ధరల్లో రూ.లక్షలు ఖర్చవుతుంది. అదే నెక్లెస్‌ను గిల్టీ నగల్లో అయితే... రెండు వందల్లో ఖరీదు చేసుకుంటున్నారు.
- పాతబస్తీలోని లాడ్‌బజార్, చార్మినార్, పత్తర్‌గట్టి, మదీనా, శాలిబండ, మదీనా, గుల్జార్‌హౌజ్ తదితర ప్రాంతాల్లోని దుకాణాలతో పాటు టేలాబండిల్లో ఈ నగలు అందుబాటులో ఉన్నాయి. వీటి కోసం పాతబస్తీలో ప్రత్యేక షోరూమ్స్ ఉన్నాయి.

వాణిజ్య పన్నులశాఖ కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కమిషనర్ లావణ్య తదితరులు

అబిడ్స్: వాణిజ్య పన్నులశాఖ నాన్‌గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం అబిడ్స్ డివిజన్ నూతన సంవత్సర 2024 కేలండర్‌ను డివిజన్ జాయింట్ కమిషనర్ లావణ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ లావణ్య మాట్లాడుతూ.. ఉద్యోగులు సిబ్బంది అధికారుల సంక్షేమానికి వాణిజ్యపన్నుల శాఖ అండగా ఉండి వారి ప్రగతికి కృషి చేస్తుందన్నారు. టీసీటీఎన్జీఓస్‌సీఏ రాష్ట్ర అధ్యక్షుడు రావుల ప్రదీప్‌కుమార్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ మహ్మద్ రహ్మత్‌అలీ, అబిడ్స్ డివిజన్ అధ్యక్షుడు సయీద్‌ఖాన్, కార్యదర్శి బషీరుద్దీన్‌ఖాద్రీ, సహ అధ్యక్షుడు రంగస్వామి, కోశాధికారి బెనర్జీ, రాష్ట్ర సహ అధ్యక్షుడు హరిప్రసాద్, కోశాధికారి దేవులపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మధు, ప్రభాకర్, శ్రీరామ్ డివిజన్ సభ్యులు పాల్గొన్నారు. డివిజన్ జాయింట్ కమిషనర్ లావణ్య, ప్రదీప్ రెడ్డి మహ్మద్ రహమత్‌అలీ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పాతబస్తీలో వైద్య సేవలను మరింత మెరుగుపరచాలి



మంత్రి రాజనర్సింహ్మతో ఆనంద్‌రావు

చార్మినార్: పాతబస్తీలో వైద్య సేవలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని, దీని కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన విషయాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ్మను కోరామని టీపీసీసీ మాజీ కార్యదర్శి కే.ఎస్.ఆనంద్‌రావు తెలిపారు. బుధవారం మంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పాతబస్తీలో వైద్యసేవలు అంతంత మాత్రంగానే కొనసాగాయని విమర్శించారు. వీటిని తమ ప్రభుత్వం మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు

చార్మినార్ : నిజాంకాలం నుంచి కూరగాయాలు, కిరాణ మర్చంట్ క్రయ విక్రయాలకు ప్రధాన కేంద్రంగా కొనసాగుతున్న మీరాలంమండిలో డ్రైనేజీ మురుగు సమస్య వేధిస్తోందని మీరాలంమండి మహంకాళేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తగిన చర్యలు తీసుకోవాల్సిన స్థానిక జలమండలి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బుధవారం దేవాలయం ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాన రోడ్డుపై పొంగి ప్రవహిస్తున్న మురుగు సమస్యను పరిష్కరించాలని కోరారు. కోట్ల అలీజా–చెడవ్ మసీద్ నుంచి మీరాలం మండి ప్రధాన రోడ్డులో మూసినది వరకు పెద్ద పైప్‌లైన్ ఉందని, ఈ ప్రధాన పైప్‌లైన్‌లో మీరాలం మండి నుంచి వచ్చే డ్రైనేజీ పైప్‌లైన్‌ను కలపాలని గత కొంత కాలంగా కోరుతున్నామన్నారు. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు.

రాష్ట్రంలో సుపరిపాలన



కాంగ్రెస్ నేతలతో అజహరుద్దీన్

గోల్కొండ : సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో సుపరిపాలన ప్రారంభమైందని కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ అజహరుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన షేక్‌పేట్ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన కేంద్రాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ తప్పకుండా కాంగ్రెస్ ఆరు హామీలలో ఏదో ఒకటి లభిస్తుందన్నారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో ప్రజాధనాన్ని దోచుకుందని విమర్శించారు. సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారు దళారులను ఆశ్రయించకుండా నేరుగా తమకు కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే ఐదేళ్లల్లో దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా రూపుదిద్దుకోవడం ఖాయమన్నారు. అనంతరం ఉద్యోగ కల్పన, పరిశ్రమల అభివృద్ధి తదితర విషయాలపై దృష్టిసారిస్తుందన్నారు. షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, పర్వేజ్, జావిద్ తదితరులున్నారు.

పదేళ్లుగా రాష్ట్రంలో ఉన్నత విద్యపై నిర్లక్ష్యం

- ప్రొఫెసర్ హరగోపాల్ వెల్లడి



సుల్తాన్‌బజార్: సావిత్రీబాయి పూలే జయంతి ఉత్సవాలను తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం తెలంగాణ రాష్ట్రంలో 'విశ్వవిద్యాలయాల ప్రస్తుత పరిస్థితి' అనే అంశంపై ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కోదండరాంలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం కేలండర్‌ను ప్రొఫెసర్లు హరగోపాల్, కోదండరాం, వీసీ ప్రొఫెసర్ విజ్జులతల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ... రాష్ట్రంలో గత పదేళ్లుగా ఉన్నత విద్య నిర్లక్ష్యానికి గురైందన్నారు. రావాల్సిన నిధులు రాకపోవడంతో ప్రభుత్వ విద్య రోజు రోజుకు నీరుగారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాల్లో శాశ్వత ప్రాతిపదికన నియమించబడిన అధ్యాపకులు లేకపోవడంతో అనేక ఏళ్లుగా కాంట్రాక్ట్ అధ్యాపకులపై ఆధారపడి విశ్వవిద్యాలయాలు నడుస్తుండటం విచారకరమన్నారు. సావిత్రీబాయిపూలే స్త్రీల అభ్యున్నతికి తన జీవితాంతం పోరాడారని తెలిపారు. ప్రొఫెసర్ విజ్జులత, యూనివర్సిటీ ఎస్‌ఓ ప్రొఫెసర్ సరస్వతమ్మ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వారజరాణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ, డాక్టర్ జయసూర్య, డాక్టర్ జ్యోతి, ఉపేందర్, సనత్, ధర్మతేజ, కృష్ణజీరావు, వెంకటేష్, శేఖర్‌రెడ్డి, యాదయ్య, పీఆర్‌ఓ కృష్ణజీ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పేమెంట్ జేడీకి ఉద్యోగ సంఘాల వినతి



నాంపల్లి: పెన్షన్ పేమెంట్ జాయింట్ డైరెక్టర్ వసుంధరను తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నేతలు కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. కేంద్ర సంఘం కోశాధికారి ధన్‌రాజ్ నేతృత్వంలో పెన్షన్ పేమెంట్ ఉద్యోగుల యూనిట్ నేతలు బుధవారం నాంపల్లిలోని డైరెక్టర్ కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ జిల్లా కార్యదర్శి సతీష్, యూనిట్ ఉపాధ్యక్షులు విజయ్‌లక్ష్మి, జేడీపీపీ యూనిట్ కోశాధికారి ధనుంజయ, జేడీపీపీఓ యూనిట్ ఉపాధ్యక్షులు శివవర్ధన్ తదితరులున్నారు.

'కాంగ్రెస్ హయాంలోనే ప్రజా సంక్షేమం'



మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాది సత్తి ప్రకాష్‌రెడ్డి తదితరులు

అబిడ్స్ : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజా సంక్షేమం, ప్రగతి, అభివృద్ధి, కొనసాగుతుందని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ లీగల్‌సెల్, హ్యూమన్‌రైట్స్, ఆర్టీఏ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర వైస్‌చైర్మన్, ప్రముఖ న్యాయవాది సత్తి ప్రకాష్‌రెడ్డి, తెలంగాణ వీఆర్‌ఓల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోల్కొండ సతీష్ కుమార్‌లు పేర్కొన్నారు. ప్రజాపాలన ద్వారా వంద రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ప్రజలకు అందించి కాంగ్రెస్‌పాలన చూపిస్తుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు వారు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగులను నట్టేట ముంచిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అన్ని వర్గాలకు అండగా ఉండి ప్రజా సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తుందన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో ఆలయాల అభివృద్ధి



బండ సూరిని సత్కరిస్తున్న బిజిని శ్రీనివాస్

అబిడ్స్ : గత పదేళ్లలో మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే గోషామహల్‌తో పాటు రాష్ట్ర నలుమూలల ఆలయాల అభివృద్ధి జరిగిందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకుడు బిజిని శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారాలతో అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమవుతోందని విమర్శించారు. బుధవారం కాళీమాత ఆలయాన్ని సొంత ఖర్చులతో అభివృద్ధి చేసి ప్రారంభించిన బండ సూరిని ఆయన ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పటిష్టంగా ఉందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ముందంజలో ఉండేలా గోషామహల్ నలుమూలల పార్టీని పటిష్టం చేస్తామన్నారు. ప్రతి పండుగకు గత ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించేదని పేర్కొన్నారు. ఆకంటి నాగేష్, బాల ముకుంద్, బిజిని రవీందర్ పాల్గొన్నారు.

అభయహస్తం గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎర్రబెల్లి దుర్గేశ్వర్

నాంపల్లి: అభయహస్తం గ్యారంటీలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ ఎర్రబెల్లి దుర్గేశ్వర్ కోరారు. నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ పర్యవేక్షణలో కొనసాగుతున్న పలు సహాయ కేంద్రాలను సందర్శించిన ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ పక్షాన బస్తీల్లో అభయహస్తం గ్యారంటీల గురించి అవగాహన కల్పించామన్నారు. ఈనెల 6వ తేదీ వరకు ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తులను స్వీకరిస్తారని, ప్రతి ఒక్కరూ అభయ హస్తం గ్యారంటీలను పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. యూత్ కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షులు లక్ష్మణ్‌లాల్, మల్లేపల్లి డివిజన్ అధ్యక్షుడు పృథ్వీరాజ్, కాంగ్రెస్‌నేతలు వీరు, తీరత్‌లాల్, సంతోష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను తీసుకుంటున్న అధికారి భారతి

1596 దరఖాస్తుల స్వీకరణ..

గౌలిపురా : ప్రజాపాలనలో భాగంగా చాపలగల్లీలోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 1596 దరఖాస్తులను స్వీకరించినట్లు కేంద్రం అధికారి భారతి తెలిపారు. బుధవారం గౌలిపురా డివిజన్‌లోని ఈ కేంద్రంలో ప్రజలకు అవసరమైన దరఖాస్తులను ప్రతిరోజు అందిస్తున్నామన్నారు. ప్రజలు తమ దరఖాస్తులను పూర్తిచేసి తిరిగి తమకు అందజేస్తున్నారన్నారు. ప్రజాపాలనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు.

నిరుపేదలకు బాసటగా..

జియాగూడ: సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన అభయహస్తం కార్యక్రమం నిరుపేదలకు బాసటగా నిలిచిందని గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వినోద్ చౌగ్లే అన్నారు. బుధవారం జియాగూడలోని డోర్‌బస్తీ కమిటీహాల్, ఎంసీహెచ్ డబుల్‌బెడ్రూం కమిటీహాల్‌లలో నిరుపేదలకు అభయహస్తం ఫారాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటికే రెండు పథకాలను విజయవంతంగా కొనసాగిస్తుందని, మిగతా పథకాలను కూడా ప్రజలకు నేరుగా అందేలా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. జియాగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దర్శన్‌కుమార్, కార్వాన్ డివిజన్ అధ్యక్షులు జగన్‌గౌడ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, నవీన్, సుదేష్, హరికిషన్ తదితరులున్నారు.

కులవివక్షకు వ్యతిరేకంగా సావిత్రీబాయి పూలే కృషి



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళలు

గౌలిపురా: ఛత్రినాక చౌరస్తాలో మిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే 193వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బుధవారం సావిత్రీబాయి పూలే చిత్రపటానికి కమిటీ మహిళ విభాగం ప్రతినిధులు ఎస్.శైలజా పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ... కుల వివక్షతకు, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీర మహిళ సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. మహిళల విద్యాభివృద్ధికి ఆమె చేసిన కృషి తొలితరం మహిళా ఉద్యమకారిణి అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, పండ్లు పంపిణీ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్పీ. క్రాంతికుమార్, ప్రతినిధులు రఘు, రాఘవేందర్, వెంకటేష్, మహిళా ప్రతినిధులు కల్పన, మహేశ్వరి తదితరులున్నారు.



'ది లీడర్' అవార్డు ప్రదానం..

గౌలిపురా : ప్రజాసేవలో నిరంతరం కృషిచేస్తున్న కాంగ్రెస్ నాయకుడు కె.వెంకటేష్‌ను తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి 'ది లీడర్' అవార్డుతో ఘనంగా సన్మానించారు. ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలను సమితి ఆధ్వర్యంలో నాంపల్లిలోని గాంధీభవన్ ప్రకాశంహాల్‌లో ఘనంగా నిర్వహించారు. వృత్తితో పాటు రాజకీయ, ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయనను మహేష్‌కుమార్‌గౌడ్ శాలువాతో ఘనంగా సన్మానించి అవార్డును ప్రదానం చేశారు. ఏఐసీసీ సెక్రటరీ, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుర్గారావు, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ సంఘ వీరప్ప, మహిళా అధ్యక్షురాలు కొత్త బాయమ్మ తదితరులున్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతల పంపిణీ



గుడిమల్కాపూర్‌లో స్వామివారి అక్షింతలు, చిత్రపటం అందజేత

గోల్కొండ: ఈనెల 22న హిందూ సోదరులంతా తమతమ ఇళ్లను దీపాలతో అలంకరించి దీపావళి జరుపుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు దేవర వంశీ అన్నారు. బుధవారం ఆయన గుడిమల్కాపూర్ డివిజన్‌లో ఇంటింటికీ తిరిగి శ్రీరాములోరి అక్షింతలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 22వ తేదీ మానవ జాతికి ఓ గొప్ప రోజు అని అన్నారు. అయోధ్యలో శ్రీరామ మందిర ప్రారంభోత్సవాన్ని ఒక మహాపర్వంగా ప్రతి ఒక్కరూ నిర్వహించుకోవాలన్నారు. అనిల్, అశ్విన్ తదితరులున్నారు.

చాంద్రాయణగుట్ట: లలితాబాగ్ డివిజన్‌లో బీజేపీ నాయకులు అయోధ్య రామ మందిరం అక్షింతలను బుధవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. నాయకులు ధరంకార్ రాజేందర్‌జీ, అశోక్‌రావు, బాబు, మాణిక్‌రావు, కుషాల్, సంజయ్ తదితరులున్నారు.



ఓల్డ్ సిటీలోని కులీ కుతుబ్‌షా గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సైదులు, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.
– సాక్షి, సిటీబ్యూరో